క్లుప్తంగా

హైకోర్టు తీర్పు హర్షణీయం



ఆర్.కృష్ణయ్య, సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: మూడు నెలల్లో బీసీ కులగణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అన్నారు. ఈమేరకు బుధవారం నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వంగూరి నారాయణయాదవ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మునాస ప్రసన్నకుమార్, బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, వెంకన్నయాదవ్, నాగరాజుగౌడ్, సతీష్‌యాదవ్, భరత్, శ్రీనివాస్, యాదగిరి, రమేష్, వెంకటేశ్వర్లు, దుర్గయ్య పాల్గొన్నారు.

పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్: అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుడిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నియామకమయ్యారు. ఈ మేరకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుడిగా నియమించినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వీరేశం కృతజ్ఞతలు తెలిపారు.

15న వెంకటపతి ట్రస్ట్ వార్షికోత్సవం

నల్లగొండ టౌన్: ఎస్‌ఆర్‌ఆర్ వెంకటపతి ట్రస్ట్ వార్షికోత్సవాన్ని ఈ నెల 15న వెంకటపతి భవన్‌లో నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ వెంకటపతి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పోసం రఘుపతి, సీనియర్ పోలీస్ అధికారి చైతన్య, మిర్యాల సోమయ్య, దుడుకు లక్ష్మీనారాయణ, చిలుకూరి పరమాత్మ, చెరుపల్లి యాదగిరి పాల్గొంటారని పేర్కొన్నారు. చదువులో ప్రతిభ చూపిన పద్మశాలీ విద్యార్థులకు నగదు పురస్కారాలు, పుస్తకాలు, పద్మశాలీ పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారమే లక్ష్యంగా పనిచేస్తాం

నల్లగొండ టూటౌన్: రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తామని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు అన్నారు. బుధవారం ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో ఆయన బీజేపీలో చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మనోహర్‌రెడ్డి, డ్వాబ్ ప్రతినిధులు పెండ్యాల దామోదర్‌రావు, సీదునూరి పరమేష్, రంగారావు పాల్గొన్నారు.

17న విద్రోహదినంగా పాటించాలి

నకిరేకల్: సెప్టెంబర్ 17న విద్రోహ దినంగా పాటించాలని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ప్రతినిధి ఇందూరు సాగర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని సాగించిందని గుర్తు చేశారు. యూనియన్ సైన్యం తెలంగాణ ప్రజలకు తీవ్ర ద్రోహం చేసిందని, అందుకు సెప్టెంబర్ 17 విద్రోహ దినమే అని పేర్కొన్నారు.

ఆసరా పింఛన్లు పెంచాలి

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆసరా వృద్ధాప్య పింఛన్‌ను రూ.2వేల నుంచి రూ.4వేలకు పెంచాలని సీనియర్ సిటిజన్ జిల్లా నాయకుడు పామనగుళ్ల అచ్చాలు డిమాండ్ చేశారు. బుధవారం చిట్యాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత బస్ పాస్‌లు ఇవ్వాలని, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం మండల నాయకులు నాతి ముత్తిలింగం, జిల్లా సత్తయ్య, సాయిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఆనందం వెంకటేశం, ఇస్తారి, చంద్రయ్య పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు పాల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి బుధవారం స్టడీ మెటీరియల్, బ్యాగులు అందజేశారు. తమ ఫౌండేషన్ ద్వారా గత తొమ్మిదేళ్లుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేస్తున్నట్లు రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివస్వరూపరాణి, కాంపిటేటివ్ ఎగ్జామ్ ఇన్‌చార్జ్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెటీరియల్స్, బ్యాగులు అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి

పూర్వ విద్యార్థుల అపూర్వ సేవ

- పాఠశాలకు, ఊరుకు సేవ చేయాలని నిర్ణయించుకున్న పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు
- పాఠశాలకు బీరువాలు, కంప్యూటర్లు, కుర్చీల అందజేత
- టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, నగదు ప్రోత్సాహకాల పంపిణీ

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్ 1985– 86 బ్యాచ్‌కు చెందిన 50 మంది పదో తరగతి పూర్వ విద్యార్థులు తమ పాఠశాలను, చదువుకున్న ఊరును మరిచిపోకుండా విద్యాభివృద్ధితో పాటు పలు విద్యా, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ పాఠశాలలో చదువును పూర్తి చేసిన అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిర పడ్డారు. వారు 2017లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాఠశాలకు, ఊరుకు సేవ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు కొంత డబ్బును జమ చేసి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు.

సేవా కార్యక్రమాలు ఇవీ..

- పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌కు రూ.40వేలతో నాలుగు బీరువాలు, పది కుర్చీలు అందజేశారు.
- ఆరెగూడెం గ్రామంలో ప్రభుత్వ యూపీఎస్ పాఠశాలకు రూ.15వేలతో ప్రింటర్ అందజేశారు. అదేవిధంగా మరో రూ.15వేలతో మైక్ సెట్ అందించారు.
- పెద్దకాపర్తి, ఆరెగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు అందజేశారు.
- ఆరెగూడెంలోని యూపీఎస్‌కు రూ.60వేలతో రెండు కంప్యూటర్లు, టేబుళ్లు, కుర్చీలు అందించారు.
- పెద్దకాపర్తి గ్రామంలోని శ్రీతిరుమలనాథ స్వామి దేవాలయంలో 2018లో జరిగిన ఉత్సవాల్లో రూ.60వేలతో అన్నదానం చేశారు. అంతేకాకుండా ఆలయంలో పలు అభివృద్ధి పనులకు సైతం విరాళాలు ఇచ్చారు.
- పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌లోని పదో తరగతి విద్యార్థులకు ప్రతియేటా వార్షిక పరీక్షలకు ముందు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. అదేవిధంగా ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు.
- తమతో కలిసి చదువుకున్న తోటి స్నేహితులు ఎవరైనా మృతిచెందితే బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తూ అండగా నిలుస్తున్నారు.



ఆరెగూడెంలోని ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు (ఫైల్)

అందరి సహకారంతోనే సేవా కార్యక్రమాలు



మేము పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నప్పుడు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నాం. దీంతో అందరు తమ శక్తి మేరకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. మేము చదువుకున్న స్కూల్‌లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు.

– కోట రాంబాబు, పూర్వ విద్యార్థి, పెద్దకాపర్తి

అధిక మొత్తంలో ఆర్థిక సహకారం

హాంకాంగ్‌లో నివాసం ఉంటున్న కోయగూర శ్రీనివాస్, పోలీస్‌శాఖలో పనిచేస్తున్న సాపిడి మోహన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ ఈ.ప్రభాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి అనిత సేవాకార్యక్రమాలకు గాను ఇప్పటి వరకు అధిక మొత్తంలో ఆర్థిక సహకారాన్ని అందించారు. అదేవిధంగా చిట్యాల పరిసర ప్రాంతాల్లో ఉంటున్న పోట్లపల్లి వెంకన్నగౌడ్, కోట రాంబాబు, ఎస్. శ్రీనివాసరెడ్డి, సీహెచ్. రాజన్‌బాబు మిగతా మిత్రుల సహకారంతో పెద్దకాపర్తి గ్రామంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని పోలీస్ ఆడిటోరియంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, శాంతి సంఘం సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు కేటాయించిన మార్గంలో వెళ్లాలన్నారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణ కేంద్రంలోని వల్లభరావు చెరువులో 10 ఫీట్ల లోపు విగ్రహాల నిమజ్జనం, 10 ఫీట్ల పైబడిన విగ్రహాలు 14 మైలు వద్ద నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో టూటౌన్ ఇన్‌స్పెక్టర్ డానియల్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ క్రాంతి, ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, శాంతి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దు

నల్లగొండ టౌన్: భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దని, ప్రభుత్వమే కార్మికులకు అమలు చేయాలని తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన జిల్లా ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద బీమా, తదితర పథకాలను బీమా కంపెనీలకు అప్పజెప్పాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. వెల్ఫేర్ బోర్డులో ఉన్న నిధులు కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలన్నారు. సమావేశంలో బైరం దయానంద్, అద్దంకి నరసింహ, సత్యనారాయణ, జిట్ట నగేష్, ఎస్‌కే బషీర్, బొల్లెద్దు సైదులు, జ్యోతి, వెంకటయ్య, వెంకన్న, సురేష్, రామకృష్ణ, హుస్సేన్, రోశయ్య, ధనమ్మ, అంజయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గణనాథుడికి ఎమ్మెల్యే పూజలు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చెరుకు రామలింగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, చిట్యాల మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు అంతటి వెంకటేష్‌గౌడ్, గుండ్రాంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు నమ్ముల విజయ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ దోర్నాల రామచంద్రం, బండ అంజయ్య, గోపగోని నర్సింహ, బోడిగె బాలరాజు, మిద్దెల మధు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

చిట్యాల: మండలంలోని ఏపూరు గ్రామంలో రూ.10లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ, ఎంఈఓ నర్సింహ, ఎంపీఓ రమేష్, ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్యకుమారి, ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్స్ సునీత, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



గుండ్రాంపల్లిలో వినాయక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కట్టంగూర్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి అస్రమ్ అంజుమ్ అన్నారు. బుధవారం కట్టంగూర్ మండలంలోని గార్లబాయిగూడెం గ్రామంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, పాఠశాల హెచ్‌ఎం సముద్రాల నారాయణ, అంగన్‌వాడీ టీచర్ రేగట్టె సునీత, బోడ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం

కనగల్: మండల పరిధిలోని తేలకంటిగూడెం, జి.యడవల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీలత, మంజుల ఆధ్వర్యంలో పోషణ వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా పోషకారం ప్రాముఖ్యతను వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది మహేశ్వరి, ఏఎన్‌ఎం బాలథెరిస్సా, అంగన్‌వాడీ టీచర్లు సునీత, రమణ పాల్గొన్నారు.



కనగల్: తేలకంటిగూడెంలో అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ శ్రీలత

పౌష్టికాహారం తీసుకోవాలి

చండూరు(గట్టుప్పల్): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్య కుమారి అన్నారు. గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్ శివేషా, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులు పరిశుభ్రత పాటించాలి

నల్లగొండ టూటౌన్: ఆహార పదార్థాలు విక్రయించే చిరు వ్యాపారులు పరిశుభ్రత పాటించాలని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చిరు వ్యాపారులు, మాంసం విక్రయదారులతో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్ల వెంట బండ్లు పెట్టి ఆహార పదార్థాలు విక్రయించేవారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, ఆహారాన్ని కల్తీ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్ల వినియోగం నిలిపివేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మెప్మా పీడీ కరుణాకర్, ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ జ్యోతిర్మయి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల కమిటీ ఎన్నిక

కనగల్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల నూతన కమిటీని బుధవారం నల్లగొండ పట్టణంలో ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ బోడ స్వామి, మండల అధ్యక్షుడు పందుల రాజా ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడిగా పొట్టేపాక మహేందర్, మండల ప్రధాన కార్యదర్శిగా కిన్నెర స్వామి, మండల ఉపాధ్యక్షుడిగా దాసరి సురేష్, మండల సహాయ కార్యదర్శిగా నామ అశోక్, మండల కార్యవర్గ సభ్యుడిగా తొలుగల్లు నాగరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు పెరిక వెంకన్న, అంజయ్య, హరిప్రసాద్, బోడ ప్రభాకర్, యనమల అనిల్ పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

నల్లగొండ టౌన్: బీసీ గురుకులాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గురుకుల ఆర్‌సీఓ కార్యాలయంలో అధికారులెవరూ లేకపోవడంతో వినతిపత్రాన్ని కార్యాలయ తలుపునకు అంటించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు సరైన సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారన్నారని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలన్నారు.



ఆర్‌సీఓ కార్యాలయ తలుపు వద్ద వినతిపత్రం పెడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి



మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

చిట్యాల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా బుధవారం చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అంజయ్యాచారి, పబ్బు వీరాస్వామి, బలుగూరి నర్సింహ, వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, రామలింగయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు పాండురంగారావు, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి సైదులుగౌడ్, సీపీఐ మండల కార్యదర్శులు అక్బర్, శంకర్, శ్రీనివాస్, సతీష్, గ్రామశాఖ కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేముల చిత్రపటానికి పాలాభిషేకం



ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం (ఒకటవ వార్డు)లోని పెద్ద చెరువుకు బుధవారం ధర్మారెడ్డిపల్లి కాల్వ నీరు రాక ప్రారంభమైంది. ధర్మారెడ్డిపల్లి కాల్వ కంప చెట్లుతో నిండిపోవడంతో ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవ తీసుకుని కాల్వలో పూడికతీత, కంపచెట్లు తొలగింపు పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలతో మూసీ ప్రాజెక్టులో నీటి వరద పెరిగి శివనేనిగూడెం గ్రామ శివారులోని పెద్ద చెరువులోకి నీరు చేరుకుంది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కాల్వ నీటికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెబోయిన మల్లేష్, దాదే ఉపేందర్‌రెడ్డి, రెముడాల సైదులు, మైల శంకర్, రుద్రవరం రవీందర్, రెముడాల నర్సింహ, రెముడాల యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు బుధవారం అండర్– 14, 17 విభాగంలో క్రీడాపోటీల కన్వీనర్, హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా.. సుమారుగా 8 పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్– 14 విభాగంలో చిట్యాల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కబడ్డీలో మొదటి స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బ్రహ్మయ్య, పీఈటీలు జానకి, శ్రీదేవి, గఫార్, వెంకటరమణ, ఉపాధ్యాయులు గోగికార్ మాధవి, సీహెచ్ శ్రీనివాస్, కోణం శ్రీనివాస్, శైలజ, కవిత, మంజుల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీలో విజేతగా నిలిచిన చిట్యాల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

పల్లెసుద్దులు కళా ప్రదర్శనకు రాష్ట్రస్థాయి అవార్డు

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ గ్రామానికి చెందిన సామాజిక కళాకారుడు మామిడి శ్రీను కళాప్రదర్శనకుగాను రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని కోటి ఉమెన్స్ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారం రోజుల పాటు పల్లెసుద్దులు, బుర్రకథ, గోండు సంప్రదాయంపై ప్రదర్శనలు ఇచ్చామని శ్రీను తెలిపారు. పల్లెసుద్దుల విభాగంలో పౌష్టికాహారం, రక్తహీనతతో గర్భిణులు ఎదుర్కొంటున్న సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తాము ఇచ్చిన కళా ప్రదర్శనకు అవార్డు దక్కినట్లు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం నిర్వాహకుల చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు.



అవార్డు అందుకుంటున్న మామిడి శ్రీను

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం

నార్కట్‌పల్లి: నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన కల్లెపల్లి దశరథ రాములు కుమార్తె హిరణ్య అనారోగ్యంతో బాధపడుతోంది. ఆపరేషన్ నిమిత్తం మన ఆపద్బంధు ఫౌండేషన్ అధ్యక్షుడు పంజాల శశికుమార్ రూ.20 వేల ఆర్థికసాయాన్ని బుధవారం స్థానిక ఎస్‌ఐ క్రాంతికుమార్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు గణేష్, సభ్యులు సాయి, సురేష్, రిషి, కార్తీక్, శివరామ్ ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు శశికుమార్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మర్రిగూడ: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు మర్రిగూడలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మలిగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మునగాల జగాల్‌రెడ్డి, జిల్లా శంకర్, వెంకట్‌రెడ్డి, నరసింహ, హరినాథ్, సురేష్, లింగయ్య, వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, వెంకటయ్య, రవీందర్, యాదయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతిరెడ్డి

దేవరకొండ: ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు, సర్టిఫికెట్లు పరిశీలించి పలు ల్యాబ్‌లను అయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న సేవలు, ఓపీ, ఇతర వివరాలను తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలని సూచించారు. అర్హతలకు మించి వైద్యం అందించకూడదన్నారు. అంతకుముందు ఇటీవల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శిశువు మృతి చెందిన ఘటనపై ఆయన ఆరా తీశారు. సదరు ఆసుపత్రికి నోటీసు అందజేసి శిశువు మృతికి గల కారణాలు అడిగి తెలుసున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవి ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చందంపేట: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పోలేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్‌సెంటర్‌ను సందర్శించి మాట్లాడారు. పల్లెప్రకృతి వనం పక్కనే మెడిసిన్ వ్యర్థాలను వేయడం సరికాదని అన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ

కట్టంగూర్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహభావం, శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఎంఈఓ నాగయ్య అన్నారు. బుధవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంబటి అంజయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, రాజశేఖర్, పుల్లయ్య, మాణిక్యం, చిన్ని శ్రీనివాస్, విఠల్, మంగ ఉన్నారు.

స్థానిక ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధం చేయాలి

మర్రిగూడ: త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. బుధవారం మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్, ఆర్ఐ నజీరొద్దీన్, సిబ్బంది మధు, రమేష్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

శాలిగౌరారం: మండలంలోని చిత్తలూరు గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. గ్రామానికి చెందిన రైతు బాసాని శ్రీను తన పత్తిచేనులో అరక తోలాడు. మధ్యాహ్నం సమయంలో ఎద్దులను అరక విడిచాడు. ఈక్రమంలో సమీపంలోని బీడు భూమిలో మేత మేసుకుంటూ వెళ్లిన ఎద్దు తెగిపడి ఉన్న విద్యుత్ తీగను తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది. దాని విలువ సుమారు రూ.60 వేలకు పైగా ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

భీంరెడ్డి ఇందిరమ్మకు నివాళి

శాలిగౌరారం: మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు దివంగత భీంరెడ్డి రాంరెడ్డి సతీమణి భీంరెడ్డి ఇందిరమ్మ (70) అనారోగ్యానికి గురై మంగళవారం మృతిచెందింది. బుధవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతదేహానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, లోకసాని రంగారెడ్డి, గన్నపురెడ్డి భిక్షంరెడ్డి, యుగంధర్‌రెడ్డి, నూక భద్రయ్య, భూపతి అంజయ్య, పెరుమాండ్ల నరేశ్, మంగదుడ్ల శ్రీను, వేముల గోపినాథ్ తదితరులున్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మృతి

నకిరేకల్: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నకిరేకల్ శాఖ అధ్యక్షుడు పసల మరియాదాస్(70) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. నకిరేకల్‌లోని వీటీ కాలనీలో నివాసం ఉంటున్న మరియాదాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి 12 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన మృతికి రిటైర్డ్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు బాదిని లింగయ్య, సోమయ్య, శివకోటి, ఆంజనేయులు, నర్సింహారెడ్డి సంతాపం తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నాంపల్లి: నాంపల్లి మండలంలోని తుంగపహాడ్ గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. కేతెపల్లి గ్రామానికి చెందిన ఉప్పల సాయి, చింతపల్లి మండలంలోని వింజమూర్ గ్రామానికి చెందిన అల్లంపల్లి శ్రవణ్‌లు తుంగపహాడ్ గ్రామంలోని ఓ ఇంట్లో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉంచారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇంటిని తనిఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.